సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 8 । నవంబర్ । 2024



డుంబ్రిగుడ పీహెచ్‌సీ తనిఖీ

డుంబ్రిగుడ పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. 8లో



ఘనంగా పంచామృతాభిషేకం

విశాఖ: బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం నిర్వహించారు.



జూ కొలనుకు జలకళ

విశాఖ: ఇందిరాగాంధీ జూ పార్కులోని కొలను ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరడంతో కళకళలాడుతోంది.

న్యూస్‌రీల్

విజయసాయిరెడ్డికి అభినందనలు





విజయసాయిరెడ్డితో అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రవిబాబు

సాక్షి, పాడేరు/పాడేరు: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డిని అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పార్టీ రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రవిబాబు, స్వాతిరాణి తదితరులు గురువారం విశాఖలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

అందుబాటులో తిరుపతి లడ్డూ ప్రసాదం

రంపచోడవరం: ఇక్కడికి సమీపంలోని ఐ.పోలవరం వద్ద కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుపతి లడ్డూ ప్రసాదం అందుబాటులో ఉంటుందని ఆలయ అధికారి నారాయణరాజు తెలిపారు. ఐ.పోలవరం వద్ద కొండపై వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని టీటీడీ నిర్మించింది. ప్రతీ నెల రెండో శనివారం తిరుపతి ప్రసాదాన్ని ఇక్కడ భక్తుల కోసం అందుబాటులో ఉంచుతున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 9వ తేదీన తిరుమల వేంకటేశ్వర స్వామి ప్రసాదం అందుబాటులో ఉంటుందన్నారు.

13న అరకు ఆర్‌ఐటీఐలో జాబ్‌మేళా

పాడేరు : ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీ డాప్ ఆధ్వర్యంలో ఈనెల 13న అరకు ఆర్ ఐటీఐలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ పి. రోహిణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో పారడైస్ ఫుడ్‌కోర్టు, విన్నర్ సాఫ్ట్ సొల్యూషన్, మెడ్‌ప్లస్, పీవీఆర్ ఐనాక్స్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. జిల్లాలో 18 ఏళ్ల నుంచి నుంచి 30 సంవత్సరాల వయసు గల టెన్త్, ఇంటర్, డిగ్రీ ఆపై పాసైన నిరుద్యోగ యువతీ యువకులు హాజరు కావాలన్నారు. ఇంటర్వ్యూలకు విచ్చేసే అభ్యర్థులు పాన్, ఆధార్‌కార్డులతోపాటు విద్యార్హత ధ్రువీకరణ పత్రాల జెరాక్స్ కాపీలు తీసుకురావాలని కోరారు. ఎంపికైన వారికి నెలకు రూ.10వేల నుంచి రూ.14వేల వరకు వేతనం ఇవ్వనున్నట్టు చెప్పారు. పూర్తి వివరాలకు 9491057527, 9398338105 నంబర్లలో సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

వివరాలు నమోదు చేసుకోండి

- జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సూచన

పాడేరు : త్వరలో రానున్న నూతన క్రీడ పాలసీకి సంబంధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు తమ వివరాలను ఈనెల8వ తేదీలోపు అందజేయాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ. జగన్మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారి సర్టిఫికెట్లను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు 63031 93400, 9000274225 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

బియ్యం అక్రమ నిల్వలపై విచారణ



బాలికల జూనియర్ కళాశాలలో విచారణ జరుపుతున్న అధికారులు

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ గిరిజన బాలికల జూనియర్ కళాశాలలో గత నెల 23వ తేదీన వెలుగు చూసిన బియ్యం అక్రమ నిల్వలపై గురువారం రంపచోడవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఈ. జాన్‌రాజు విచారణ జరిపారు. ఆయనతోపాటు ప్రిసైడింగ్ అధికారిగా గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ. విజయశాంతి కూడా ఈ విచారణలో పాల్గొన్నారు. ఆ రోజు జరిగిన చోటుచేసుకున్న పరిణామాలపై కళాశాలలోని అధ్యాపకులు, విద్యార్థినులు, సిబ్బంది నుంచి వాఙ్మూలం సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులను అందజేస్తామని వారు తెలిపారు. ఏటీడబ్ల్యూవో కె.కృష్ణమోహన్, గురుకులం సెల్ సీనియర్ అసిస్టెంట్ ఎస్. నాగేంద్రకుమార్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



అరకు పైనరీలో ప్రత్యేక ఆకర్షణగా పైన్ వనాలు



ట్రీహట్‌పై ప్రీ వెడ్డింగ్ చిత్రీకరణ



విద్యుత్ దీప కాంతుల్లో ఆకర్షణీయంగా కాఫీ హౌస్


వనంలో విహారం

ఆకట్టుకుంటున్న అరకు పైనరీ అందాలు.. అంజోడ సిల్క్‌ఫారంను తీర్చిదిద్దిన అటవీశాఖ



అంజోడ సిల్క్ ఫారం.. ఒకప్పుడు కళావిహీనం.. ఇప్పుడు అటవీశాఖకు రూ.లక్షల్లో ఆదాయమిచ్చే వనరు. అటవీ పర్యాటకంలో భాగంగా ఇక్కడి పైన్, అకేషియా వనాలను సంరక్షించింది. అరకు పినారీ పేరిట అభివృద్ధి చేసింది. కుటుంబ సమేతంగా ఆహ్లాదకర వాతావరణంలో గడిపేందుకు ఇక్కడ అన్ని వసతులను అందుబాటులోకి తెచ్చింది. మన్యానికి వచ్చే ప్రతి పర్యాటకుడు సందర్శించేలా తీర్చిదిద్దుతోంది.

- ఎకో టూరిజంలో అభివృద్ధి
- కుటుంబ సమేతంగా రాత్రి బస చేసేలా సౌకర్యాలు
- రూ.1.02 కోట్ల కేటాయింపు
- సందర్శకులను ఆకట్టుకుంటున్న పైన్ వృక్షాలు, ట్రీహట్స్
- ఆసక్తి చూపుతున్న పర్యాటకులు
- ఏడాదిలో రూ.42.13 లక్షల ఆదాయం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమందికి ఉపాధి



ఆకట్టుకుంటున్న ప్రవేశ ద్వారం

డుంబ్రిగుడ: మండలంలోని జైపూర్ జంక్షన్ రోడ్డును ఆనుకుని ఉన్న అరకు పైనరీ పర్యాటకులకు విశేషంగా ఆకట్టుకుంటోంది. కొర్రయి పంచాయతీ అంజోడ గ్రామ పరిధిలోని ఈ ప్రాంతంలో సిల్క్‌ఫారం ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు 35 ఎకరాలు కేటాయించింది. దీనికి అప్పటిలో అంజోడ సిల్క్‌ఫారం అని పేరు పెట్టింది. అయితే సిల్క్‌ఫారం ఏర్పాటు కాకపోవడంతో ఈ స్థలం ఖాళీగా ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం 1962–63లో ఈ ప్రాంతాన్ని అటవీశాఖకు కేటాయించింది. ఆ తరువాత ఈ స్థలంలో 1963–64లో నీలగిరి, సిల్వర్, 1971–72లో విదేశీ పైన్ మొక్కలను నాటింది. సుమారు 35 ఎకరాల్లో పెద్దవయ్యాయి. 1985–1995 మధ్య ఇక్కడ సుమారు 1500 వరకు చెట్లు ఉండేవి. సిల్క్‌ఫారం మీదుగా విశాఖ- కిరండూల్ రైల్వే లైన్‌ఉన్నందున సుమారు 9 ఎకరాలు ఆశాఖకు కేటాయించగా 26 ఎకరాలు మాత్రమే మిగిలింది.

- ఇక్కడి వనాలు ఆకర్షణీయంగా ఉన్నందున సినిమా షూటింగ్‌లు జరిగేవి. ఎన్టీఆర్ నటించిన బ్రహ్మర్షి విశ్వామిత్ర చిత్రంలో కీలక సన్నివేశాలు ఇక్కడ చిత్రీకరించారు.
- 2014 హుదూహుద్ తుపానుకు సుమారు వెయ్యి వరకు చెట్లు నేలకొరిగాయి. వీటిలో కొన్నింటిని అటవీశాఖ టెండర్ల రూపంలో విక్రయించగా, మరికొన్నింటిని స్మగ్లర్లు పట్టుకుపోయారు. చివరకు 500 చెట్లు మాత్రమే మిగిలాయి. సిబ్బంది కొరత వల్ల అటవీశాఖ పర్యవేక్షణ కరువైంది. దీంతో ఈ ప్రాంతం చట్టవ్యతిరేక కార్యకలాపాలకు నిలయంగా మరింది.



పిల్లల కోసం ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు

అభివృద్ధికి బాటలు

గిరిజన ప్రాంతమంతా ప్రత్యేక జిల్లా ఏర్పాటుతో పర్యాటకుల రాక పెరిగింది. వారిని ఆకట్టుకునేలా అటవీ పర్యాటకంపై అటవీ అధికారులు దృష్టి సారించారు. దీనిలో భాగంగా అంజోడ సిల్క్ ఫారంను అరకు పైనరీగా తీర్చిదిద్దారు. ఇందుకు రూ.1.02 కోట్లు వెచ్చించిన అటవీశాఖ సుమారు 25 ఎకరాల చుట్టూ రక్షణ కంచె నిర్మించింది. చెట్లపై కాటేజీలు, వ్యూపాయింట్లు, కాఫీ హౌస్, లోపల క్యాంపెయిన్ టెంట్లు, రాత్రి పూట లైటింగ్ పర్యాటకులను ఆకర్షించేలా ఏర్పాటు చేసింది.

ప్రవేశ రుసుం ఇలా..: అరకు పైనరీలో ప్రవేశానికి పెద్దలకు రూ.25, పిల్లలకు రూ.10 రుసుం అటవీశాఖ వసూలు చేస్తోంది. ప్రీవెడ్డింగ్‌కు రూ.వెయ్యి, సినిమా షూటింగ్‌కు రూ. 20 వేలు చెల్లించాలి. ఇక్కడ సుమారు 15 మంది వరకు ఉపాధి పొందుతున్నారు. బిర్యానీ, చికెన్, టీ, కాఫీ వంటి అమ్మకాల ద్వారా సుమారు 30 కుటుంబాలు ఆధారపడ్డాయి. కుటుంబ సమేతంగా వచ్చిన వారికి మాత్రమే రాత్రి బసకు అనుమతిస్తామని అటవీశాఖ అధికారవర్గాలు తెలిపాయి. మద్య పానం పూర్తిగా నిషేధమని పేర్కొన్నాయి. ఈ విషయాన్ని గుర్తించాలని తెలిపాయి.

- గత ఏడాది నవంబర్ 18న అందుబాటులోకి వచ్చిన పైనరీని ఇప్పటివరకు 60 నుంచి 70 వేల మంది సందర్శించారు. వెయ్యికి పైగా ప్రీవెడ్డింగ్, మూడు సినిమా షూటింగ్‌లు జరిగాయి. సుమారు రూ.42.13 లక్షల ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు.

పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం



పర్యాటకులను ఆకట్టుకునేలా అరకు పైనరీని తీర్చిదిద్దుతున్నాం. ఇప్పటికే చాలావరకు అభివృద్ధి చేశాం. మరి కొంత చేయాల్సి ఉంది. ఉన్నతాధికారుల సహకారంతో 2025 నాటికి పర్యాటకులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని ఆశిస్తున్నాం. ఆహ్లాదకర వాతావరణంలో గడిపేందుకు అనువుగా వసతులు ఉన్నాయి. – శ్రీనివాసరావు, అటవీశాఖ రేంజ్ అధికారి, అరకు డివిజన్

వనాల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ



హుద్‌హుద్ తుపాను తరువాత 500 పైన్ వృక్షాలు మాత్రమే మిగిలాయి. నేలకొరిగిన వాటి స్థానంలో మొక్కలు నాటుతున్నాం. ఈ విధంగా గత ఏడాది రెండు వందల పైన్ మొక్కలను నాటాం. వీటి సంరక్షణకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాం. పూలమొక్కలను పెంచుతున్నాం. పర్యాటకులను ఆకర్షించేలా గార్డెనింగ్ చేపడతున్నాం. – ఎం.శేఖర్, మేనేజర్, అరకు పైనరీ

లాభాపేక్ష లేని సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు : జిల్లా పరిపాలనలో అర్థవంతమైన మార్పు కోసం ఎన్జీవోలు, సీఎస్సార్ మంజూరు చేసే కంపెనీలు, లాభాపేక్ష లేని సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల ఎనిమిది నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కలెక్టరేట్‌లో ప్రారంభమవుతుందన్నారు. నమోదు చేసుకునేందుకు ఈనెల 20వరకు గడువు ఉందన్నారు. దరఖాస్తు చేసుకునే ఎన్జీవో దర్పన్ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని, ఏదైనా ప్రభుత్వం నుంచి గతంలో గ్రాంట్ పొంది ఉండాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు గత రెండేళ్లగా జిల్లాలో చురుకుగా పనిచేసి ఉండాలన్నారు, పూర్తి వివరాలకు 8106797474నంబరులో నారాయణరెడ్డిని సంప్రదించాలని సూచించారు.

సీలేరులో షూటింగ్ సందడి

- మదం సినిమాలో కొన్ని సన్నివేశాల చిత్రీకరణ



సన్నివేశం చిత్రీకరణకు ఏర్పాట్లు



సీలేరు నది ఒడ్డున చిత్రీకరణలో నిమగ్నమైన యూనిట్ సభ్యులు

సీలేరు: సీలేరు పంచాయతీ చింతపల్లి క్యాంపు గ్రామంలో బుధవారం సినిమా షూటింగ్‌తో సందడి నెలకొంది. కొత్త కథానాయిక, నాయకులతో నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించి కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఈవైకా హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట సూర్యదేవర రవీంద్రనాథ్, కోయ రమేష్ బాబు నిర్మాణ సారథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి మదం టైటిల్ పెట్టినట్టు చిత్ర యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంబంధించి సన్నివేశాల్లో స్థానికులకు నటించే అవకాశం కల్పించామని పేర్కొంది. నెల రోజులపాటు ఈ ప్రాంతంలో చిత్రీకరణ జరుగుతుందని, సీలేరు పరిసర అందాలు ఎంతో తమను ఆకట్టుకున్నాయని దర్శకుడు ఎం.వంశీకృష్ణ తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

మారేడుమిల్లి : ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. గురువారం ఆయన గుర్తేడులో ఆయన పర్యటించారు. తొలుత గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల, వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని ఆదేశించారు. అదే విధంగా మెనూ ప్రకారం ప్రతిరోజు తాజాగా ఆహార పదార్థాలు అందించాలని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వైద్యాధికారులు, సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు లబ్ధిదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ధారగెడ్డ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, ఆకుమామిడికోట జీపీఎస్ పాఠశాలలను పరిశీలించారు.



ఆకుమామిడికోటలోని జీపీఎస్ పాఠశాలను పరిశీలిస్తున్న పీవో కట్టా సింహాచలం

ఉచిత గ్యాస్ ఈకేవైసీకి మార్చి వరకు గడువు

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

పాడేరు : ఉచిత గ్యాస్ పొందేందుకు మార్చి 31లోగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 23 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 2,28,955 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. వీరిలో ఇప్పటివరకు 1,46,508 మంది మాత్రమే ఈకేవైసీ చేసుకున్నారన్నారు. వీరిని మాత్రమే ప్రస్తుతానికి అర్హులుగా గుర్తించినట్టు చెప్పారు. గ్యాస్ కనెక్షన్ కలిగి ఉండి రైస్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఈకేవైసీ చేసుకుంటేనే ఉచిత గ్యాస్ సిలిండర్లు మంజూరు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈకేవైసీ చేసుకునేందుకు ప్రస్తుతం 34 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అర్హత కలిగి వారికి ఏడాదికి మూ డు సిలిండర్లను అందజేస్తామని చెప్పా రు. ముందుగా రూ.827.50 చెల్లించి గ్యాస్ సిలిండర్ విడిపించుకుంటే రెండు రోజుల్లో వారి బ్యాంకు ఖాతాలో ఆ సొమ్ము జమ అవుతుందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఇన్‌చార్జి డీఏవో గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించండి

పాడేరు సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్

డుంబ్రిగుడ: జాతీయ రహదారిలో అక్రమ కట్టడాలను తొలగించి రోడ్డు పనులకు ఆటంకం లేకుండా సహకరించాలని పాడేరు సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్ సూచించారు. గురువారం ఆయన రెవెన్యూ కార్యాలయంలో సిబ్బందితో సమావేశ మయ్యారు. అనంతరం మండల కేంద్రంలో జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా దుకాణాలను పరిశీలించారు. సర్వే చేపట్టారు. హైవే అధికారులు నిర్దేశించిన ప్రకారం కట్టుబడి ఉండాలని ఆదేశించారు. నష్టపోయిన దుకాణదారులకు నష్టపరిహారం చెల్లించినట్టు చెప్పారు. మూడు రోజుల్లోగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని, లేకుంటే దుకాణాలు తొలగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్, రెవెన్యూ సిబ్బంది, జాతీయ రహదారి అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.



దుకాణదారులతో మాట్లాడుతున్న పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్

ఐదేళ్లలో ఊహించని మార్పు

- పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పనితీరు అద్భుతం
- ప్రశంసించిన నాక్ పీర్ ఛైర్మన్ రమేష్ శర్మ
- బృందానికి ఘనంగా స్వాగతం పలికిన విద్యార్థులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమావేశమైన నాక్ పీర్ బృందం సభ్యులు



నాక్ బృందానికి స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు



డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతో నాక్‌పీర్ బృందం సభ్యులు

పాడేరు: కొండ కోనల్లో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండే ఏజెన్సీ ప్రాంతంలోని పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పనితీరు అద్భుతంగా ఉందని నాక్ పీర్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ శర్మ కొనియాడారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ముగ్గురు సభ్యులతో కూడిన నాక్ పీర్ బృందం గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించింది. వారికి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు గిరిజన సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. కళాశాలలో అన్ని డిపార్ట్‌మెంట్లు, ల్యాబ్‌లు, ఫర్నిచర్, గార్డెన్స్, మరుగుదొడ్లు, రికార్డులు, ఫ్యాకల్టీ, విద్యార్థుల బోధన విధానాన్ని పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం వేశారు. కళాశాల ప్రాంగణంలో గిరిజన విద్యార్థులు ప్రదర్శించిన థింసా నృత్యాలకు ఫిదా అయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలను తనిఖీ చేసిన మొదటి రోజు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. రెండు రోజుల పర్యటన అనంతరం నివేదిక అధారంగా పది రోజుల తర్వాత కళాశాలకు నాక్ గ్రేడ్‌లను ప్రకటిస్తామన్నారు. ప్రతీ ఐదేళ్లకోసారి నాక్ బృందం తనిఖీ చేస్తుందని, 2019లో అప్పటి నాక్ బృందం తనిఖీలో కళాశాలకు సీ గ్రేడ్ వచ్చిందన్నారు. ఈ ఐదేళ్లలో కళాశాలలో ఇంత మార్పు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయ్, అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాక్ పీర్ టీమ్ మెంబర్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ కుల్‌భూషణ్ చండీల్, బృందం సభ్యురాలు డాక్టర్ సుష్మా బోస్లే తదితరులు పాల్గొన్నారు.

మత్స్యగెడ్డలో గల్లంతైన గిరిజనుడి మృతి

- కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగింత



మత్స్యగెడ్డలోంచి సొంబ్రన్న మృతదేహాన్ని బయటకు తెస్తున్న స్థానిక గిరిజనులు

ముంచంగిపుట్టు: చేపల వేటకు వెళ్లి మత్స్యగెడ్డలో గల్లంతైన పనసగుడియా సొంబ్రన్న(49)మృతదేహం లభ్యమైంది. సుజనకోట సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, ఎస్‌ఐ రామకృష్ణ, వీఆర్వో భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో మృతదేహాన్ని గుర్తించారు. బయటకు తీసి అంబులెన్సులో స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. సొంబ్రన్న మృతితో పోషించే దిక్కు కోల్పోయామని భార్య, రంభ, కుమారుడు వినోద్‌కుమార్ రోదించారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామం గొడుగులపుట్టు తరలించారు.

నవజాత శిశు రక్షణ అందరి బాధ్యత

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

పాడేరు : నవజాత శిశు రక్షణ బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఐసీడీఎస్, వైద్యారోగ్య శాఖ, జిల్లా లీగల్ సెల్ అథారిటీ సంయుక్తంగా శిశు సంరక్షణపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పుట్టిన శిశువు సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండాలంటే తల్లి గర్భం దాల్చిన నాటి నుంచి ప్రతినెలా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరమన్నారు. చిన్న పిల్లల్లో సహజంగానే రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుందన్నారు.అందువల్ల నవజాత శిశువులకు ఆరునెలల పాటు తల్లిపాలు పట్టించాలన్నారు. ఆడ, మగబిడ్డలను సమానంగా చూడాలన్నారు. వీటన్నింటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ ఆస్పత్రిలో ప్రసవాలు మరింత పెరగాలన్నారు. పుట్టిన బిడ్డకు వైద్యుల సూచన మేరకు వ్యాక్సిన్ వేయించాలన్నారు. గర్భిణులు ప్రసవ సమయానికి రెండు వారాల ముందు బర్త్ వెయిటింగ్ హాల్లో చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్‌సీహెచ్ పోర్టల్లో గర్భిణుల వివరాలను సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఐసీడీఎస్, వైద్యారోగ్యశాఖ సంయుక్తంగా కలిసి పని చేయాలని సూచించారు. వన్ స్టాప్ సెంటర్‌లో శిశు సంరక్షణాధికారిని నియమించినట్టు చెప్పారు. బాలికల సంక్షేమంపై దృష్టి సారించాలని ఆదేశించారు. బాలికల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోక్సో కేసు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలను దత్తత కావాలనుకునే వారు కారా వెబ్‌సైట్లో నమోదు చేసుకోవాలన్నారు. బాలికల అక్రమ రవాణాపై మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, సీడీపీవో ఝాన్సీలక్ష్మి, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, డీఎస్ఎస్ఏ సభ్యులు టి. ప్రసాద్‌నాయుడు, మిషన్ వాత్సల్య ప్రోగ్రాం అధికారి ఎస్.అశోక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, పక్కన ఐటీడీఏ పీవో అభిషేక్

క్లుప్తంగా

పర్యాటక ప్రాంతాల్లో డస్ట్‌బిన్‌ల ఏర్పాటు

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : పర్యాటక ప్రాంతాల్లో డస్ట్‌బిన్లను ఏర్పాటు చేయాలని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ ఆదేశించారు. గురువారం ఐటీడీఏ కార్యాలయం నుంచి పాడేరు, అనంతగిరి, అరకువ్యాలీ, చింతపల్లి తహసీల్దార్లు, ఎంపీడీవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పలు సూచనలు చేశారు. పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యం మరింత మెరుగుపర్చాలన్నారు. పర్యాటకులు ప్లాస్టిక్ సంచులు, వాటర్ బాటిళ్లను వెంట తీసుకురాకుండా నియంత్రించాలని ఆదేశించారు. ప్లాస్టిక్‌ను నియంత్రించి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, డీఎల్‌పీవో పీఎస్ కుమార్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



ప్రమాదంలో దగ్ధమైన ఇల్లు

ఎటపాక: మండలంలోని కృష్ణవరం గ్రామ పంచాయతీ గొందిరాజుపేటలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ పూరిల్లు దగ్ధమైంది. గ్రామంలోని కారం రవి ఉదయం పొలం పనులకు వెళ్లగా, తన కుమార్తె ఇంట్లోనే ఉండి టీవీ చూస్తున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ప్రమాదాన్ని గమనించి బాలిక ఇంటి నుంచి బయటకు పరుగులు తీసింది. మంటలతో ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలడంతో ఆ సమయంలో స్థానికులు మంటలు ఆర్పేందుకు సాహసించలేదు. ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే ఇంట్లోని నిత్యావసరాలు, దుస్తులు, గృహోపకరణాలు, రూ.21వేల నగదు మంటల్లో కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ. 2లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా వేశారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అందరి సమన్వయంతో పార్టీ బలోపేతం




సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, పార్టీ నేతలు

- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాడతాం
- కార్యకర్తలకు పెద్ద పీట వేస్తాం
- 2027 ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయమే లక్ష్యం
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి

విశాఖ సిటీ : ఉత్తరాంధ్రలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరిని సమన్వయం చేసుకుంటూ శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన తర్వాత ఆయన విశాఖలో మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అధ్యక్షతన ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలతో గురువారం లాసెన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు వై.వి. సుబ్బారెడ్డి పార్టీ బలోపేతానికి కృషి చేశారని, దాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. గతంలో పాలన చేసిన అనుభవంతో ఉత్తరాంధ్రలో పరిస్థితులపై పూర్తి అవగాహన ఉందన్నారు. ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ వారితో మమేకమయ్యేలా కార్యక్రమాలు చేపడతామన్నారు. అందుకు అందరూ సహకరించాలని కోరారు. ముఖ్యంగా స్టీల్‌ప్లాంట్ అంశంలో చంద్రబాబు చేతులెత్తేశారని, వైఎస్సార్ సీపీ మాత్రం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తుందని స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షులు, సమన్వయకర్తలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు.. ఇలా అందరిని సమన్వయం చేసుకుంటూ.. 2027 చివరిలో జరిగే ఎన్నికల్లో ఉత్తరాంధ్రలోని అన్ని నియోజకవర్గాల్లో విజయమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తామని వివరించారు. గతంలో పార్టీ కార్యకర్తలను విస్మరించిన మాట వాస్తవమే అని.. ఇప్పుడు వారికి పూర్తి ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి నుంచి కార్యకర్తల అభివృద్ధికి పాటు పడతామని చెప్పారు. సమావేశంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, కన్నబాబు రాజు, కంబాల జోగులు, పెట్ల ఉమాశంకర్ గణేష్ , అదీప్ రాజు, చింతలపూడి వెంకటరామయ్య, కె.భాగ్యలక్ష్మి, శోభ హైమావతి, పి.వరలక్ష్మి, సమన్వయకర్తలు కేకే రాజు, మలసాల భరత్, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల రవికుమార్(రవిరెడ్డి), ఉరుకూటి అప్పారావు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం సందర్శన

కొమ్మాది: ఎండాడలో గల వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయాన్ని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి తొలిసారిగా సందర్శించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి ఆయనకు స్వాగతం పలికారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



దుంబ్రిగుడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



గూడెం కొత్తవీధిలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

దుంబ్రిగుడ: జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి పి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాధి లక్షణాలను గుర్తించి సమర్థవంతమైన చికిత్స విధానాలు తెలుసుకోవాలని కోరారు. క్యాన్సర్ వ్యాధి పట్ల కీలకమైన సమాచారం ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని కోరారు. వైద్యాధికారి అంబిక రమణి, ఎంపీహెచ్‌వో శౌరి, హెచ్‌వీ పద్మ, హెల్త్ అసిస్టెంట్‌లు స్వామి, సంజీవ్, ప్రభకార్, లోవరాజు, సిబ్బంది జగదీష్, అనిల్ పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని పెదవలసలో గురువారం నిర్వహించిన క్యాన్సర్ దినోత్సవంలో వైద్యాధికారి కోమలి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలను ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే నివారణ వీలు కలుగుతుందన్నారు. పొగతాగడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బంది గ్రామాల్లో ఇళ్లకు వచ్చినప్పుడు వారికి సహకరించాలని కోరారు. హెచ్‌ఈ శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఈవో పెద్దబాలరాజు, హెచ్‌వీలు దేవామణి, రోజిగోల్డ్, పారామెడికల్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు



కూనవరంలో మానవహారం నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



నెల్లిపాకలో అవగాహన ర్యాలీ చేస్తున్న సిబ్బంది

ఎటపాక: మండలంలోని నెల్లిపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జాతీయ కాన్సర్ దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు అవగాహన కలిగి క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే అరికట్టవచ్చన్నారు. త్వరలో ఇంటింటికి క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్ ప్రత్యూష్ తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ అరుంధతి, సిబ్బంది సీతమ్మ, గంగరాజు తదితరులున్నారు.

కూనవరం: మండల కేంద్రంలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు సునీల్‌కుమార్, రాజీవ్ తదితరులు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ పాన్ పరాగ్, గుట్కా, పొగతాగడం, కొన్ని రకాల రసాయనాలు వాడడం, ప్లాస్టిక్ వలన క్యాన్సర్ వస్తుందన్నారు. క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే అరికట్ట వచ్చన్నారు. త్వరలో ఇంటింటికి తిరిగి క్యాన్సర్ పరీక్షలు చేస్తారని తెలిపారు. సూపర్‌వైజర్ శ్రీనివాస్, రత్తయ్య, మల్లేశ్వరి, సీహెచ్‌ఓ పార్వతి, ఆశలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులను అడిగి తెలుసుకుంటున్న నీతి ఆయోగ్ ఉప సలహాదారుడు మురళీధర్

అరకులోయ రూరల్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా సమష్టిగా కృషి చేయాలని న్యూఢిల్లీకి చెందిన నీతి ఆయోగ్ ఉప సలహాదారుడు మురళీధర్ తెలిపారు. మండలంలో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించారు. మాడగడ పంచాయతీ చంపగుడలో టెర్రసింగ్ పనులను పరిశీలించారు, చినలబుడు పంచాయతీ హట్టగుడలో ఫారం ఫాండ్, చొంపి పంచాయతీ పప్పుడువలసలో జల్‌జీవన్ మిషన్ పథకాలను పరిశీలించి పనుల లోటుపాట్లుపై ఆరా తీశారు. కొత్తవలసలో ఉపాధి హామీ పథకం వేతనదారులతో సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపడుతున్న ఉపాధి హామీ పథకం సక్రమంగా నిర్వహించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో పనులు కల్పించాలన్నారు. జల్ ఉత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఉదయ్ భాస్కరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తేజ, ఏపీడీ పవన్‌కుమార్, ఏపీవో జగదీశ్వరరావు పాల్గొన్నారు.

అలిగి ఇంటి నుంచి పారిపోయిన బాలిక

- నగరంలో అర్ధరాత్రి తిరుగుతుండగా గుర్తించిన పోలీసులు
- గురువారం తల్లిదండ్రులకు అప్పగింత



బాలికను తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

విశాఖ సిటీ: మనస్పర్థల కారణంగా అలిగి ఇంటి నుంచి పారిపోయి వచ్చిన చింతపల్లికి చెందిన బాలికను పోలీసులు గురువారం మళ్లీ కుటుంబ సభ్యులకు అప్పగించారు. చింతపల్లి మండలానికి చెందిన 14 ఏళ్ల బాలిక కుటుంబ సభ్యులపై అలిగి ఇంటి నుంచి పారిపోయి నగరానికి వచ్చేసింది. అర్ధరాత్రి పాత్ జైలు రోడ్డులో ఒంటరిగా తిరుగుతున్నట్లు గమనించిన ఒక వ్యక్తి 112కు కాల్ చేసి సమాచారం అందించాడు. దీంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని బాలికను టీఎస్సార్ కాంప్లెక్స్‌లో ఉన్న నైట్‌షెల్టర్‌లో ఉంచారు. ఆమె తల్లికి సమాచారం అందించారు. గురువారం ఆమె నగరానికి రావడంతో బాలికను తల్లికి అప్పగించారు.

సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

నర్సీపట్నం: విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంతో ఈ ప్రాంతవాసులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందుతుందని కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. రూ.67.35 కోట్లతో నిర్మించే 220 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను సీఎం చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం నుంచి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను 220 కేవీ స్థాయికి పెంచడం వల్ల జిల్లాలోని ఆరు మండలాల్లో 175 గ్రామాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మూడు మండలాల్లో 369 గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఏడాది కాలంలో నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. నాణ్యమైన విద్యుత్ లభ్యం కావడం వల్ల ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందన్నారు. జెడ్పీటీసీ రమణమ్మ, కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.విజయ్ మాట్లాడారు. ఏపీఈపీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బి.శ్యామ్‌ప్రసాద్, ఆర్డీవో వి.వి.రమణ, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ, తహసీల్దార్ రామారావు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



గుర్తేడు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఐటీడీఏ పీవో సింహాచలం

వై.రామవరం: మెరుగైన బోధనతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యే శ్రద్ధ చూపాలని ఐటీడీఏ పీవో కట్ట సింహాచలం గురువారం ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎం, వార్డెన్, ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని గుర్తేడు, దారగడ్డ, ఆశ్రమ పాఠశాలలను పీవో సందర్శించి తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార మెనూ అమలుపై ఆరా తీశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలల్లో సౌకర్యాలను పరిశీలించారు. అనారోగ్యమైన విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం గుర్తేడు పీహెచ్‌సీను సందర్శించారు. రికార్డులు తనిఖీలు చేశారు. మెరుగైన వైద్య సేవలు అందించే విధానంపై సలహాలు సూచనలు ఇచ్చారు.

దారి దోపిడీకి పాల్పడిన నలుగురి అరెస్టు

విశాఖ సిటీ: జాతీయ రహదారిపై లారీలు ఆపి వారిపై దాడి చేసి నగదు, సెల్‌ఫోన్లు దోచుకుంటున్న నలుగురు వ్యక్తులను ఆరిలోవ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లాకు చెందిన రెల్లి రాంబాబు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 5వ తేదీ రాత్రి 11 గంటలకు మాంగనీస్ లోడుతో టి.కృష్ణ అనేక క్లీనర్‌తో కలిసి విశాఖ పోర్టు నుంచి బొబ్బిలికి బయలుదేరాడు. హనుమంతవాక జంక్షన్ దాటిన తరువాత విమ్స్ ఆస్పత్రి గేటు వద్ద రాత్రి 11.30 గంటలకు ఒక స్కూటీపై ఇద్దరు అగంతకులు వచ్చి లారీని ఆపారు. ఇంతలో వెనుక నుంచి మరో ఇద్దరు యువకులు చేరుకున్నారు. ఆ నలుగురు డ్రైవర్‌తో పాటు క్లీనర్‌ను లారీ నుంచి కిందకి లాగి డబ్బులు డిమాండ్ చేశారు. వారి వద్ద లేవని చెప్పడంతో ముఖంపై దాడి చేశారు. ఇదే సమయంలో ఆ వెనుక వస్తున్న లారీ డ్రైవర్ రెల్లి అప్పలనాయుడు అది చూసి వారి వద్దకు వెళ్లాడు. అతనిపై కూడా దాడి చేసి రూ.450 నగదు, సెల్‌ఫోన్లు లాక్కొని పారిపోయారు. వెంటనే బాధితులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై డీసీపీ(క్రైమ్) లతా మాధురి ఆదేశాల మేరకు ఏడీసీపీ(క్రైమ్) ఎ.వెంకట్రావు, సీసీఎస్ జోన్-1 ఏసీపీ ఆధ్వర్యంలో ద్వారకా సబ్ డివిజన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ డి.బంగారుపాప, ఆరిలోవ ఎస్ఐ హరికృష్ణ, సిబ్బందితో బృందాన్ని ఏర్పాటు చేశారు. వారు దర్యాప్తు చేపట్టగా నిందితులను గుర్తించారు. పెదగదిలికి చెందిన కడుపుట్ల సందీప్, ఆరిలోవకు చెందిన అంగటి సాయి, ఎండాడకు చెందిన సి.హెచ్.రాము, ధర్మాల రాములను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. వారి నుంచి రూ.450 నగదు, రెండు సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. కేసును ఛేదించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు.



దుంబ్రిగుడ పీహెచ్‌సీ తనిఖీ

- రికార్డులను పరిశీలించిన డీఎంహెచ్‌వో జమాల్‌బాషా



పీహెచ్‌సీలో స్టోర్ రూమ్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

దుంబ్రిగుడ: స్థానిక పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఓపీ వివరాలను తెలుసుకున్నారు. మందుల గదిని పరిశీలించారు. ప్రసవాలపై ఆరా తీశారు. బాలింతల వార్డును సందర్శించారు. సేవల వివరాలను తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది ఉండేలా భవనాలు ఏర్పాటుచేయాలని వైద్యాధికారి రాంబాబు కోరారు. వైద్యాధికారి అంబిక, సిబ్బంది శౌరి, దీన, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కృష్ణకుమారికి సేవారత్న అవార్డు



ఢిల్లీలో జాతీయ సేవారత్న అవార్డు అందుకుంటున్న కృష్ణకుమారి

దుంబ్రిగుడ: హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ క్రైమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జాతీయ సేవారత్న అవార్డు 2024కి దుంబ్రిగుడ కేజీబీవీలో విధుల చేపడుతున్న కమ్మిడి కృష్ణకుమారికి అందజేశారు. ఈ సందర్భంగా గురువారం ఢిల్లీలోని జరిగిన కార్యక్రమంలో మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కృష్ణకుమారి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో తాను చేస్తున్న సేవలను గుర్తించి జాతీయ సేవారత్న అవార్డు అందజేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ కె. భవని తమ పాఠశాల సీఆర్‌టీకి కృష్ణకుమారికి అవార్డు అందడంపై సంతోషం వ్యక్తం చేశారు.

వాహనం అదుపుతప్పి ఎంఎల్‌హెచ్‌పీకి గాయాలు



గాయపడిన ఎంఎల్‌హెచ్‌పీ ముత్యాలదేవి

ముంచంగిపుట్టు: మండలంలోని బూసిపుట్టు పంచాయతీ ఎంఎల్‌హెచ్‌పీగా పనిచేస్తున్న ముత్యాలదేవి విధుల నిమిత్తం స్కూటీపై గురువారం ఉదయం వేళ్తుండగా ప్రమాదానికి గురవడంతో తీవ్రగాయాలయ్యాయి. ముంచంగిపుట్టు నుంచి బూసిపుట్టు సబ్‌సెంటర్‌కు విధుల నిమిత్తం ఎంఎల్‌హెచ్‌పి ముత్యాలదేవి వాహనంపై వెళ్తుండగా కర్రిముఖిపుట్టు సమీపంలో స్కూటీ అదుపు తప్పింది. దీంతో ఆమె కాళ్లకు తీవ్రగాయమైంది. స్కూటీ నుజ్జునుజ్జు అయింది. దీనిని గమనించిన స్థానికులు హుటాహుటినా ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారి గీతాంజలి వైద్య సేవలు అందించారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సీతమ్మధార(విశాఖ): ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌పీసీఎల్)లో ఇగ్నైట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రాం (ఐఏఏటీపీ)లో భాగంగా ఇండస్ట్రియల్ వెల్డర్, పైప్ ఫిట్టర్, ఫైర్ అండ్ సేఫ్టీ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో బి.వి.ఎస్.వంశీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్, ఐటీఐ అర్హత ఉన్నవారు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఇక్కడ 60 నుంచి 80 రోజుల పాటు శిక్షణ ఇచ్చి, ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న 18 నుంచి 27 ఏళ్ల వయసు గలవారు ఈ నెల 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 79813 36432, 83746 60705ను సంప్రదించాలని సూచించారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే శిక్షణకు ఏయూ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: మహారాష్ట్రలో జరగనున్న ముందస్తు గణతంత్ర దినోత్సవ శిక్షణా కార్యక్రమానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం తరఫున ఎంపికైన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు గురువారం అభినందించారు. ఈ నెల 12 నుంచి 21వ తేదీ వరకు మహారాష్ట్రలోని కేసీబీ నార్త్ మహారాష్ట్ర యూనివర్సిటీలో వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపు జరగనుంది. ఏయూ నుంచి ఆరుగురు విద్యార్థులు ఇందులో పాల్గొననున్నారు. ఇటువంటి అరుదైన అవకాశం సాధించిన విద్యార్థులను వీసీ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరినాథ్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో 'స్పోర్ట్స్ ఎరీనా' సత్తా



స్విమ్మింగ్‌లో విజేతలుగా నిలిచిన ఎరీనా క్రీడాకారులు

ఎంవీపీకాలనీ(విశాఖ): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా-2024 ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్, బ్యాడ్మింటన్ పోటీల్లో ఎంవీపీకాలనీలోని ఎస్-3 స్పోర్ట్స్ ఎరీనా క్రీడాకారులు సత్తాచాటారు. నరసరావుపేట వేదికగా జరుగుతున్న ఈ పోటీల్లో స్పోర్ట్స్ ఎరీనాకు చెందిన పలువురు క్రీడకారులు పాల్గొని పతకాలు కైవసం చేసుకున్నట్లు నిర్వాహకుడు సహాని గురువారం తెలిపారు. స్విమ్మింగ్‌లో ఎస్.జి శిథిస్ నాయుడు 100 మీటర్లు, 200 మీటర్ల ఫ్రీస్టైల్‌తో పాటు 200 మీటర్ల బటర్‌ఫ్లై కేటగిరీలో బంగారు పతకాలు సాధించాడు. అలాగే ఎ.హిమశ్రీ 50 మీటర్లు, 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో బంగారు పతకాలు, 400 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో రజతం సాధించింది. జి.సాయి సిద్ధార్థ్ 50 మీటర్ల ఫ్రీస్టైల్‌లో రజత పతకం కైవసం చేసుకున్నాడు. అలాగే మధ్యప్రదేశ్‌లో జరగనున్న అండర్-19 నేషనల్ స్కూల్ గేమ్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఎస్-3 స్పోర్ట్స్ ఎరీనా క్రీడాకారుడు పార్థీవ్ రాష్ట్రం తరఫున ప్రాతినిథ్యం వహిస్తున్నట్లు సహాని తెలిపారు. దీంతో పాటు పలువురు క్రీడాకారులు రాజ్‌కోట్‌లో జరిగే నేషనల్ స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనట్లు వెల్లడించారు.

రైల్వే స్టేషన్ వద్ద పోలీస్ చెక్‌పోస్ట్

24/7 తనిఖీలు చేసేందుకు ఏర్పాట్లు



రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్

సీతమ్మధార(విశాఖ): విశాఖ రైల్వేస్టేషన్ వద్ద బుధవారం రాత్రి నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో డైనమిక్ పోలీస్ చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్ట్ 24 గంటలూ పనిచేస్తుందని ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ చెక్‌పోస్ట్‌లో మొత్తం ఐదుగురు సిబ్బంది షిఫ్టుల విధానంలో పని చేస్తారని.. వారికి జనరల్ డైరీ, డ్రాగన్ లైట్లు, బాడీ వార్న్ కెమెరాలు తదితర సదుపాయాలు కల్పించామన్నారు. పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులు లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే అదుపులోకి తీసుకుని విచారించాలని సిబ్బందిని ఏసీపీ ఆదేశించారు. రైల్వేస్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా తనిఖీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఎస్.విజయకుమార్, టూ టౌన్ సీఐ తిరుమలరావు, సిబ్బంది పాల్గొన్నారు.